# ఎన్నికల అధికారులకు శిక్షణ

**ప్రిసైడింగ్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన**

బంజారాహిల్స్,అక్టోబర్ 27: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం శుక్రవారం బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబర్ 3లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. నియోజకవర్గంలోని 245 పోలింగ్ కేంద్రాలకు చెందిన ప్రిసైడింగ్ అధికారులు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు(ఏపీవో)లకు పలు అంశాలపై శిక్షణను అందించారు. ఈవీఎమ్ యంత్రాల పనితీరు, వీవీ ప్యాట్స్‌తో అనుసంధానం చేయాల్సిన పద్ధతిపై ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. పోలింగ్‌కు ముందు రోజున డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్(డీఆర్‌సీ) నుంచి పోలింగ్ కేంద్రానికి ఈవీఎమ్‌లతో పాటు ఇతర సామగ్రిని తరలించాల్సిన విధానం, భద్రతకు సంబంధించిన విషయాలు, పోలింగ్ కేంద్రాల్లో వాటిని అమర్చాల్సిన పద్ధతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ సమయంలో ఈవీఎమ్‌లకు.. వీవీ ప్యాట్లను అనుసంధానించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ తదితర టెక్నికల్ అంశాలపై సంపూర్ణంగా అవగాహన కల్పించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా అభ్యర్థి పేరు,గుర్తుతో పాటు ఫొటో కూడా బ్యాలెట్ యూనిట్‌మీద ఉంటుందని వాటిని కూడా సరిచూసుకోవాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపై ఉందన్నారు.

**మాక్ పోలింగ్ నుంచి పోలింగ్ ముగిసేదాకా..**

పోలింగ్ కేంద్రానికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని చేర్చినప్పటినుంచి మరుసటిరోజు సాయంత్రం పోలింగ్ ముగిసి ఈవీఎమ్‌లను సీల్ చేసేదాకా ఎలాంటి



ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

సమస్యలు తలెత్తకుండా చూసే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపై ఉంటుందని ట్రైనర్లు వివరించారు.

పోలింగ్‌కు ముందుగా రాజకీయ పార్టీల ఏజెంట్స్ ముందు నిర్వహించే మాక్ పోలింగ్ నుంచి పోలింగ్ ముగిసిన తర్వాత సీల్ చేసే దాకా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం శనివారం కూడా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## ప్రచార వాహనాలు ప్రారంభం



ప్రచార వాహనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

బంజారాహిల్స్,అక్టోబర్ 27: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ తరపున ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార వాహనాలు సిద్ధమయ్యాయి. శనివారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు,ఇతర నాయకులతో కలిసి ప్రచార వాహనాలు ప్రారంభించారు. ఒక్కో డివిజన్‌కు ఒక వాహనం ద్వారా స్థానిక నాయకులు ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.




**ఎముకల ఆరోగ్యంపై అవగాహన:** ప్రపంచ ఆస్టియో పోరోసిస్ వారోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని విరించి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎముకలు బలహీనంగా మారడంవల్ల కలిగే ఇబ్బందులను తగ్గించడం కోసం తీసుకోవాల్సిన ఆహారంతో పాటు ఎముకల సాంద్రతను పెంచడం కోసం జాగ్రత్తలపై ఆర్థోపెడిక్ నిపుణులు డా. నటేష్ కొలుసు, డా.ఉదయ్ ప్రకాష్‌రెడ్డి, డా.కేఎస్.నాయక్ తదితరులు అవగాహన కల్పించారు.
– బంజారాహిల్స్,అక్టోబర్ 27

# బీఆర్ఎస్ హయాంలోనే జనరంజక పాలన

**ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్**

వెంగళరావునగర్, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా రంజక పాలన కొనసాగుతుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీ డివిజన్.. జయప్రకాశ్‌నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఎంతో మంది సెటిలవుతున్నారన్నారు. అన్నదాతలను రైతుబంధు ఇచ్చి ఆదుకుంటుందన్నారు. తెలంగాణలో పంటల దిగుబడి కూడా బాగా పెరిగిందన్నారు. హైదరాబాద్ నగరం ఎంతో ప్రశాంతంగా ఉందని..శాంతిభద్రతలు బాగున్నాయని..ఇక్కడ ప్రతిరోజూ 250 సినిమా షూటింగులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి ఫలాలు కళ్లముందు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయమని..అలాగే మూడోసారి తాను ఎమ్మెల్యేగా విజయం సాధించనున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తం



జయప్రకాశ్‌నగర్‌కాలనీ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

చేశారు. స్థానికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తేగా..సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు నాగేశ్వరరావు, రామినేని శ్రీనివాస్, వంశీ, గంగాధర్‌రావు, మధుయాదవ్, సంతోష్‌గౌడ్, ఫయాజ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

**కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు..**

షేక్‌పేట్ అక్టోబర్ 27: సీఎం కేసీఆర్ చొరవతో ప్రభుత్వ పథకాలను రాజకీయాలకు అతీతంగా అందరికీ అందించామని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు,జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు.

## రేపు ఫిలింనగర్‌లో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

బంజారాహిల్స్,అక్టోబర్ 27: జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ భారతీయ వైద్య పరంపర సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్న ఈ శిబిరంలో భాగంగా దీర్ఘకాలిక జబ్బులు, వాటి పరిష్కారాలు, ఆయుర్వేద విధానంలో వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

## 29న ఉచిత వైద్యశిబిరం

కాచిగూడ,అక్టోబర్ 27: పేద, మధ్య తరగతి ప్రజల కోసం సోమాజిగూడలోని యశోద దవాఖాన సహకారంతో శ్రీనగర్ కాలనీలోని డాక్టర్ ఆదుకియాస్ ఫిజియోథెరపీ క్లినిక్‌లో ఆధునిక పరికరాలతో ఈ నెల 29న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో గుండె, బీపీ, మధుమోహం, జనరల్, కార్డియోలజీ, గైనకాలజీ, ఆర్థోకు సంబంధించిన వైద్య సేవలను అందిస్తూ, మందులను ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99670 31943, 90638 88014లో సంప్రదించవచ్చును. ఈ అవకాశాన్ని నగరంలోని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మోదీ హయాంలో.. పెరగని పేదల ఆదాయం

హిమాయత్‌నగర్,అక్టోబర్ 27: దేశంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి విమర్శించారు. శుక్రవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆమె మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ ప్రభుత్వం చిన్నాభిన్నం చేయడంతో పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మోదీ విధానాల వల్ల దేశంలో ధనవంతుల ఆదాయం భారీగా పెరిగిందే తప్ప పేదల ఆదాయం భారీగా తగ్గిందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజా స్వామ్య విలువలను ధ్వంసం చేసి ప్రజల హక్కు లను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు పోరాటాలతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

## కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 27: అకారణంగా కానిస్టేబుల్‌తో పాటు అతడి కొడుకుపై దాడికి పాల్పడిన బంధువుతో పాటు అతడి స్నేహితులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ మన్సూర్ అలీ అనే వ్యక్తి బేగంపేట పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తుంటారు. ఈనెల 26న మధ్యాహ్నం విధులు ముగించుకుని మెట్రోలో యూసుఫ్‌గూడకు వచ్చిన మన్సూర్ అలీని పికప్ చేసుకునేందుకు అతడి కొడుకు కాజా వచ్చాడు. ఇద్దరూ కలిసి బైక్‌మీద ఇంటికి సమీపంలోకి రాగానే అక్కడే ఉన్న అతడి సోదరుడు ముజఫర్ అలీ అడ్డుకున్నాడు. అతడితో పాటు బాలసుబ్రమణ్యం, గిరిధర్, భూపాల్‌రెడ్డి, చందు తదితరులు వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరడంతో దాడికి యత్నించగా కొడుకు కాజా అడ్డుకున్నాడు. దీంతో వారంతా కలిసి ఖాజాపై కర్రతో దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన కొడుకును ఆస్పత్రిలో చేర్చిన మన్సూర్ అలీ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 29న సివిల్స్ కోచింగ్ కొరకు స్కాలర్‌షిప్ టెస్ట్

చిక్కడపల్లి : సివిల్స్ సర్వీసెస్ ప్రిపరేషన్ 2024, 25 కొరకు ఉచిత శిక్షణ కోసం స్కాలర్‌షిప్ టెస్ట్, అవగాహన సదస్సును శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అకాడమీ ఎండీ. శరత్‌చంద్ర తెలిపారు. ఈ టెస్టులో ఉత్తీర్ణులైన వారికి ఉచిత సివిల్స్ సర్వీసెస్ శిక్షణతో పాటు ఫీజులో రాయితీ ఇస్తామని తెలిపారు. 29న అశోక్‌నగర్‌లో సిగ్నల్స్ వద్ద నున్న అకాడమీ లో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం 12 గంటలకు సవిల్స్ ర్యాంకర్ చేత అవగాహన ఉంటుందన్నారు.